అదుపు తప్పితే లోయలోకే!

- భయానకంగా రోళ్లమడుగు ఘాట్ రోడ్డు
- రక్షణ గోడలేవి.. చెట్లే దిక్కు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


రక్షణగోడ లేని రోళ్లమడుగు ఘాట్‌రోడ్డు

రాజంపేట : శేషాచలం అటవీ గ్రామం రోళ్లమడుగు ఘాట్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. రాజంపేట – రాయచోటి ఘాట్ రోడ్‌లో నుంచి రోళ్లమడుగు పల్లెకు వెళ్లే రహదారి ఘాట్‌రోడ్‌గా ఉంది. కేవలం రెండు కిలోమీటర్ల దూరమైనప్పటికీ, ఆ దారిలో వాహనాల రాకపోకలకు భద్రత కొరవడింది. ఈ దుస్థితి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.

పడితే లోయలోకే..

రోళ్లమడుగు ఘాట్‌రోడ్డులో ప్రయాణం భయంభయంతో సాగించాల్సిందే. ఒక వేళ వాహనం అదుపుతప్పితే నేరుగా లోయలోకి వెళుతుంది. ఇప్పటికే ఈ మార్గంలో వివిధ వాహనాల ప్రమాదాల క్రమంలో పదిమంది వరకు మృత్యువాత పడ్డారు. తాజాగా శుక్రవారం గొర్రెలను తరలిస్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నప్ప(50) మృతి చెందాడు. ఇలాంటి ప్రమాదాలు ఘాట్‌రోడ్‌లో తరుచూ జరుగుతున్నాయి.

రక్షణ గోడలేవీ..

రోళ్లమడుగు ఘాట్‌రోడ్డులో రక్షణ గోడలు మచ్చుకైన కనిపించవు. వాటిని నిర్మితం చేయించే దిశగా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించలేదు. ఫలితంగా వాహనాలు అదుపుతప్పి లోయలోకి పడటం లేదా చిన్నపాటి గుంతల్లోకి పడటం జరుగుతున్నాయి. చెట్లు లేకపోతే లోయలోపడిన వాహనం కనపడే పరిస్థితి కూడా ఉండదు. పాతకాలం నుంచి రాళ్లే అక్కడక్కడ రక్షణగోడల్లా కనిపిస్తుంటాయి. బస్సు డ్రైవర్లు సైతం రోళ్లమడుగు ఘాట్‌రోడ్‌లో వెళ్లాలంటే జంకుతున్నారు. కారణం రహదారి భద్రత లేదనే వాదన వినిపిస్తోంది. అనేక మార్లు గ్రామస్తులు, పలు ప్రజాప్రతినిధులు ఆర్‌అండ్‌బీ శాఖ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం మాత్రం శూన్యమనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం రక్షణ గోడల ప్రతిపాదనలు కూడా చేయలేదు. అటవీ గ్రామమైన రోళ్లమడుగులో నాలుగు పల్లెలు ఉన్నాయి. నిత్యం రాజంపేట, రాయచోటికి రాకపోకలు ఈ మార్గం గుండా సాగించాల్సి ఉంటుంది. ఘాట్ రోడ్డు దుస్థితితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాజంపేట – రాయచోటి మెయిన్ ఘాట్‌రోడ్డులోకి వస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అటవీపల్లె వాసుల కోసం రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోళ్లమడుగు మార్గంలో ఉన్న లోయ

భయంభయంగా ప్రయాణం



రోళ్లమడుగు ఘాట్‌రోడ్డులో భయంభయంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రోడ్డుకు ఇరువైపుల రక్షణ గోడల నిర్మితం చేయాలి. లేకుంటే వాహనం అదుపుతప్పితే లోయలోకే వెళుతుంది. కానీ ఇటీవల జరిగిన ప్రమాదాలలో చెట్లు కాపాడుతున్నాయి. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి.
– బుర్రు సురేంద్రయాదవ్, రోళ్లమడుగు, రాజంపేట

మా ఊరికి రావాలంటే..



మా ఊరికి రావాలంటే వాహనాలు జాగ్రత్త నడపాల్సి ఉంటుంది. ఏమరపాటు జరిగితే నేరుగా లోయలోకే వెళతారు. వాహనంలో ఉండే వారు బతకడం అంటే అదృష్టం ఉండాలి. రోడ్డుకు ఇరువైపుల రక్షణ గోడలు లేకపోతే వాహనాలకు చాలకష్టం. ప్రభుత్వం మా పల్లెకు వెళ్లే ఘాట్‌రోడ్డును అభివృద్ధి చేయాలి.
– పెంచలయ్య, రోళ్లమడుగు, రాజంపేట

క్లుప్తంగా

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు : పెనగలూరు వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరుటకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ తెలిపారు. తమ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియం మాత్రమే ఉందన్నారు. బాలికలకు హాస్టల్ వసతి ఉందని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు మే 22లోపు చేసుకోవాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

సంబేపల్లి : మండల పరిధిలోని దుద్యాల శ్రీ కొత్తపురమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పూజారివాండ్లపల్లె సమీపంలో కొలువైన శ్రీ కొత్తపురమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించి అందులో అమ్మవారి విగ్రహప్రతిష్ట మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులచే భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని పచ్చని తోరణాలు, వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం శ్రీ కొత్తపురమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి


హరిప్రసాద్ రెడ్డిని అభినందిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : పేద ప్రజలకు అండగా ఉండి జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సోమవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన హరిప్రసాద్ రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షులు శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6 వరకు 'వేసవి వినోదం'

రాయచోటి టౌన్ : విద్యార్థులకు వినోదం, విజ్ఞాన్ని పెంచేందుకు జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి వినోదం అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జయభరత్ రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి మురళీ యూపీ స్కూల్లో వేసవి వినోదం ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి సమేత భావనారాయణ స్వామి, శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయాల ప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం శ్రీమద్ భగవద్గీత పారాయణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు అనంతపురం జిల్లా శాంతానంద ఆశ్రమానికి చెందిన ఆధ్యాత్మిక గురువు గురు సేవానంద స్వామి, సుబ్బరామచంద్రులు ఉదయం శ్రీమద్ భగవద్గీత అమృత వచనములు, సాయంత్రం మహా విష్ణు సహస్ర నామ పారాయణంను వినిపించారు.

రేపటి నుంచి మహాభారత యజ్ఞం

రామాపురం : మండల కేంద్రంలో రేపటి(బుధవారం) నుంచి మహాభారత యజ్ఞం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.రమేష్ రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, కమిటీ సభ్యులు సోమవారం పేర్కొన్నారు. మహాభారత యజ్ఞం జరిగే ప్రాంతంలో వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి సస్యశామలంగా ఉండటమే కాక ప్రజలు ఆయురారోగ్యాలతో ఉంటారని విశ్వాసమన్నారు. మహాభారతంలో 18 పర్యాయాలు పగలు హరికథ రూపంలో రాత్రులు నాటక రూపంలో ప్రజలను అలరిస్తారన్నారు.

కార్మికులకు అవగాహన


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డిస్ట్రిబ్యూటర్

రాయచోటి టౌన్ : ప్లైజీ కంపెనీ పద్ధతితో అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని పాలీ కార్బాక్సిలేట్ ఈథర్ సరఫరాదారుడు కోటకొండ బాలాజీ అన్నారు. ప్లైజీ ఇండియా ప్రైవేట్ లిమిటేడ్ సంస్థ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని కాంక్రీట్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లైజీ సేవలను మారుమూల గ్రామాలలో విస్తృత చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్లైజీలో పీసీఈ పద్ధతి ద్వారా కాంక్రీట్ నిర్మాణాలు చేపడితే నీటి వినియోగం 40 శాతం తగ్గుతుందని, బలం, జీవిత కాలం పెరుగుతుందని, సజావుగా సెటింగ్, చక్కని ఫినిషింగ్ లభిస్తుందని, భవిష్యత్తులో లీకేజీ సమస్య ఉండదని తెలిపారు.

అంగన్‌వాడీలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

రాయచోటి అర్బన్ : కార్మికులు వీరోచితంగా పోరాడి 8 గంటల పనిని సాధించుకున్న దినమైన మేడేను జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలోని అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి మేడే బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులను తగ్గించడం, పేదలకు ఎంతో ప్రయోజనాన్ని కలిగించే పథకాన్ని చివరకు ఎత్తివేయాలని చూస్తుండడం దుర్మార్గమన్నారు. జనాభాకు అనుగుణంగా కొత్తసెంటర్లు ఏర్పాటు చేయకపోవడం, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయకపోవడం, ఏళ్ల తరబడి జీతాలు పెంచకపోవడం వంటి అంశాలు ప్రైవేటీకరణ యత్నాలకు నిదర్శనం కాదా ? అంటూ ప్రశ్నించారు. ప్రస్తుత పాలకులు 8గంటల పనిదినాన్ని కాలరాస్తూ మళ్లీ 13, 14 గంటలు పనిచేయించాలని చూస్తూ పాతకాలాన్ని గుర్తుకు తెస్తున్నారన్నారు. పాలకుల ప్రయత్నాలను కార్మికులు ఐక్యప్రతిఘటనతో తిప్పికొట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలంతా సమష్టిగా మేడే ర్యాలీకి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సిద్దమ్మ, శ్రావణి, సుమలత, సురేఖ, రాజమ్మ, సుహాసినిలు పాల్గొన్నారు.

కులగణన చేయమంటే అరెస్టులు చేస్తారా ?

ప్రభుత్వంపై మండిపడ్డ బీసీ సంఘాల నేతలు


మాట్లాడుతున్న బీసీ నేత ఇడగొట్టు నాగేశ్వరరావు

రాయచోటి అర్బన్ : బీసీ కులాల అభ్యున్నతికి తోడ్పడే కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్న నేతలను ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన పలు బీసీ సంఘాల నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు జనాభా లెక్కలతో పాటు వెంటనే కులగణనను చేపట్టాలన్న డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకమిటీ పిలుపుమేరకు ర్యాలీ చేస్తున్న వారిని అరెస్టుచేయడం సిగ్గుమాలిన చర్య అభివర్ణించారు. తమది బీసీల ప్రభుత్వమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ర్యాలీ చేస్తున్న బీసీ నేతలనే అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలను అణగదొక్కాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదంటూ హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు దువ్వూరి నరసింహాచారి, వెంకటరమణ, శ్రీనివాసులు, హబీబుల్లా, తులసీరామ్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగి మృతి బాధాకరం


మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న పీడీ, ఏపీడీ, సిబ్బంది తదితరులు


ఓబులవారిపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైల్వేకోడూరు కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ మలిశెట్టి విశ్వనాథ్ (49) మృతి చెందడం బాధాకరమని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లి, అరవపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్ సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడు 2006వ సంవత్సరం నుంచి జాతీయ ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈయన నెలరోజుల క్రితం ఓబులవారిపల్లి నుంచి రైల్వేకోడూరుకు బదిలీ అయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ ప్రతాప్‌లు విశ్వనాథ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణ సహాయానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. నివాళులు అర్పించిన వారిలో ఎంపీడీఓ మల్ రెడ్డి, నాగార్జున, మృత్యుంజయరావు, రాజంపేట క్లస్టర్ పరిధిలోని ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, జాతీయ ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

సమ్మర్ జాయ్ మెటీరియల్ పంపిణీ



పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వేసవి సెలవులలో సరదాగా నేర్చుకుందాం అనే మెటీరియల్‌ను ఉపాధ్యాయుడు రమణ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌లో వేసవిలో సరదాగా గడపడం కోసం వినోదాన్ని పంచే మైండ్ గేమ్స్, పొడుపు కథలు, సరదా కథలు, డ్రాయింగ్, రంగులు వేయడం, పదకేళి, మెదడుకు మేత, నిజ జీవిత గణితం, మైండ్ మ్యాపింగ్ వంటి వివిధ అంశాల ఉందని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, సరదాగా పిల్లలు నేర్చుకుంటారని తెలియజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఉద్యోగులు

రైల్వేకోడూరు అర్బన్ : తాలూకాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోడూరు తాలూకా ఏపీఎన్జీఓ అధ్యక్షునిగా పి.ఓబులేసు సోమవారం పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఓబులేసు, కార్యదర్శిగా రవీంద్రమ్మ, కోశాధికారిగా అస్లాం తదితరాలతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అందరికి అందుబాటులో ఉండి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, రవిశంకర్, రవికుమార్, విజయ్‌కుమార్, సంతోష్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, రమేష్, యశోద, అనసూయ, సురేష్, శరత్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌లు, తొలగింపులను వెంటనే ఆపాలి


రాయచోటి అర్బన్: రిలే నిరాహారదీక్షలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు


రాజంపేట: డిపో ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టిన ఎన్ఎంయూ నేతలు

రాయచోటి టౌన్ : కార్మికులు, ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్‌లు, తొలగింపులను ఆర్టీసీ యాజమాన్యం వెంటనే ఆపివేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ఎం.యస్.రావు, జోనల్ అధ్యక్షుడు వినోద్‌లు డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘం నేతలు పీఎస్ఎం రాజు, బీఆర్‌బీ నాయక్, సి.వి.రమణ, బీఎస్ రెడ్డి, మధుసూదన్, వి.పి. నాయుడు, రెడ్డెప్పలు సోమవారం డిపో ఎదుట రిలే నిరాహారదీక్షలలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగినులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని అమలు చేయాలన్నారు. 114 జీఓలో తెల్పిన విధంగా నైట్ హోటల్ బ్యాంక్ రూ.150 నుంచి 400లకు పెంచాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే ఆర్థిక సంస్థ ద్వారా కొనుగోలు చేయాలంటూ కోరారు. ఉద్యోగులు అనారోగ్యం పాలైనప్పుడు జీతంతో కూడిన సెలవులను మంజూరు చేయాలన్నారు. గత నాలుగేళ్లుగా ఆపేసిన ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలన్నారు. పారదర్శకమైన బదిలీ పద్ధతిని అమలు చేయాలని, డబుల్ డ్యూటీలకు అమౌంట్‌ను పెంచాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ యూనియన్ నేతలు శ్రీరాములు, మునిక్రిష్ణ, సి.యస్.రాజు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేటలో ఎన్ఎంయూ రిలే నిరాహారదీక్షలు బస్టాండు వద్ద సోమవారం చేపట్టింది. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి రమణ, గ్యారేజ్ కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతా 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్‌లను ఆపాలన్నారు. గ్యారేజ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్ రూ.400 తక్షణమే చెల్లింపులు చేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు సూపర్‌లగ్జరీ బస్సులో అనుమతించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. దీక్షా శిబిరంలో కాగా అనేక సమస్యలపై నిరసన గళం విప్పారు. కార్యక్రమంలో గ్యారేజ్ అధ్యక్షుడు గోపాల్, డిపో అధ్యక్షుడు ఈశ్వరయ్య, పీవీ ఈశ్వరి, జాయింట్ సెక్రటరీ సుబ్బయ్య, ఆర్‌వీ భాస్కర్, శంకరయ్య, కుమారితో పాటు గ్యారేజ్ సభ్యులు, డిపో సభ్యులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారులపై చర్యలు తీసుకోండి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మాసాపేట ప్రజలు

రాయచోటి అర్బన్ : తమ ప్రాణాలు పోతున్న పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిధిలోని మాసాపేట 31వ వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం వారు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసాపేట నారాయణస్వామి వీధిలో జనావాసాల నడుమ విద్యుత్‌తీగలు ఉన్నాయన్నారు. ప్రాణాపాయం కలిగించే విధంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని పలు మార్లు ఆశాఖ అధికారులకు విన్నవించుకున్నా వారు పట్టించుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల క్రితం కమాల్‌బీ అనే మహిళ విద్యుత్‌ఘాతానికి గురై మరణించినా అధికారులు తొలగించలేదన్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా తమ ఇళ్లకు కరెంటు షార్ట్ సర్క్యూట్ అవుతూనే ఉంటుందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరింపచేయాలంటూ వారు డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు ఎస్.శ్రీనివాసులు, రంగారెడ్డి, సుమిత్ర, హుస్సేన్, బుజ్జమ్మతో పాటు మాసాపేట వాసులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి


మంగంపేట సమస్యలను విన్నవిస్తున్న తల్లెం భరత్‌రెడ్డి

రాజంపేట : మంగంపేట భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవిని కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో మంగంపేట ఆర్అండ్ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లె, అరుంధతివాడకు చెందిన వారి భూములను ఏపీఎండీసీ, మంగంపేట అభివృద్ధికి తీసుకోవడం జరిగిందన్నారు. 2013 భూసేకరణ, ఆర్అండ్ఆర్ చట్టం చేయడం జరిగిందన్నారు. ఆ చట్ట ప్రకారం పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం ఇవ్వాలన్నారు. పారదర్శకత కోసం నియమించిన ఆర్ఆర్ కేంద్రాల పనులలో జాప్యం జరుగుతోందన్నారు. డేంజర్ జోన్‌లో ఉన్న ఆలయాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, పెండింగ్ నిధులు విడుదల కాలేదన్నారు. పాఠశాల నిర్మాణం, క్రీడామైదానం, అంగన్వాడీ భవనం, శ్మశాన నిర్మాణ పనులు, కమ్యూనిటీ హాల్‌నిర్మాణం, పార్కు తదితర పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన గ్రామస్తులకు న్యాయమైన ప్రయోజనాలు పొందేలా చూడాలన్నారు. బాధిత కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలన్నారు. ఆర్అండ్ఆర్ నిబంధనలు సకాలంలో అమలుపరచాలని సబ్‌కలెక్టర్‌ను విన్నవించామన్నారు.

మా వీధిలో పైపులైను ఏర్పాటు చేయండి


కమిషనరుకు వినతిపత్రం అందచేస్తున్న మన్నూరు బలిజపల్లె వాసులు

రాజంపేట : మా వీధిలో మంచినీటి పైపులైను ఏర్పాటు చేయాలని పట్టణంలోని 8వ వార్డు మన్నూరు బలిజవీధి నివాసీయులు మున్సిపల్ కమిషనరు శ్రీనివాసరావును కోరారు. సోమవారం ఆయన చాంబరులో కమిషనరు కలిసి వినతి పత్రం అందజేశారు. తెలుగు అధ్యాపకులు, కవి, పండితులు గంగనపల్లె వెంకటరమణ, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు డి.చెంగల్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయురాలు హైమావతి, భాస్వంత రెడ్డి తదితరులు కమిషనరును కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మంచినీటి సరఫరాకు నోచుకోక ఇబ్బంది పడుతున్నామని ఆవేదనను తెలియజేశారు. ఫ్లోరైడ్‌తో కూడిన బోరు నీళ్ల ద్వారా కాలం గడుపుతున్నామన్నారు. వ్యాధుల బారీన పడుతున్నామన్నారు. ఇప్పటికైనా మంచినీటి పైపును, మురుగు నీటి పారుదల కాలువను నిర్మితం చేయాలన్నారు. కమిషనరు సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

గ్రంథాలయాల్లో మొదలైన వేసవి సందడి


సిద్దవటం: గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు


రాయచోటి అర్బన్: శిబిరంలో పేపర్ బొమ్మల తయారీలో నిమగ్నమైన పిల్లలు

సిద్దవటం : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి రోజు విద్యార్థులతో ప్రార్థనా కార్యక్రమం జరిపినట్లు తెలిపారు. విద్యార్థులకు పుస్తక ఠనం, క్యారంబోర్డు, చెస్, లూడో ఆటలను ఆడించినట్లు చెప్పారు. గ్రంథాలయంలోని పుస్తకాలను చదవడం ద్వారా అనేక విషయాలకు సంబంధించిన సమాధానాలు దొరకడంతో పాటు, పరిజ్ఞానం పెంపొందుతారన్నారు. గ్రామంలో అన్ని వయస్సుల వారు ఈ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు రాఘవ రెడ్డి హాజరై విద్యార్థులకు నీతి కథలను చెప్పించామని తెలియజేశారు

పిల్లలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

రాయచోటి అర్బన్ : తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొనడం ద్వారా పిల్లలు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న జెవివి వేసవి శిక్షణ శిబిరంలో జెవివి నేత గోపాల్ దాస్ రాజశేఖర్ పేపర్ క్రాఫ్ట్ నైపుణ్యాలను పిల్లలకు నేర్పించారు. పిల్లలకు సమయపాలన నేర్పించడం, తమ భావోద్వేగాలను వ్యక్త పరచడమే కాక నియంత్రించుకోవడం, సామాజిక నైపుణ్యాలను ప్రోత్సహించడం, తమ ఊహలకు తగ్గట్టుగా ఆకృతులను రూపొందించే నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ కళ ఎంతగానో తోడ్పడుతుందని తెలియజేశారు. అనంతరం డాన్స్ మాస్టర్ శివ పిల్లలకు వివిధ రకాల పాటలకు నృత్యాలను నేర్పించారు. జెవివి జిల్లా కమిటీ నేత ఓబులరెడ్డి మాట్లాడుతూ 10 రోజుల పాటు నిర్వహించే ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు. శిబిరంలో జె.వి.వి నేతలు బయారెడ్డి, వై.సి.రెడ్డెప్పరెడ్డి, శివారెడ్డి, రామయ్య, ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను తుదముట్టించాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

రైల్వేకోడూరు అర్బన్ : కశ్మీర్‌లో దాడులు చేసిన ఉగ్రవాదులను నడివీధిలో ఉరితీయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రైల్వేకోడూరులోని జర్నలిస్టులు స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులను చంపిన ఉగ్రవాదులను, పాకిస్తాన్ టెర్రరిస్టులను అంతమొందించాలని వారు డిమాండ్ చేశారు. దేశ ప్రజలంతా సైనికుల వెంట ఉన్నారని, ప్రతి ఒక్కరూ ఒక సైనికుడై పోరాటడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముష్కర పాకిస్తాన్‌కు సరైన గుణపాఠం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు సుగవాసి రాజశేఖర్, రమేష్, వేణుగోపాల్ చౌదరి, సింగాలగారి రమేష్ బాబు, ప్రసాద్, వేణుగోపాల్, ఇర్ఫాన్, శ్రీనివాసరాజు, వంకర సుబ్రమణ్యం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో చతికిల'బడి'

- బాయ్స్ స్కూల్ లో 105 మందిలో 71 మంది ఫెయిల్
- కేజీబీవీ 36 మందికి 15 మంది ఫెయిల్


గాలివీడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల

గాలివీడు : ఇటీవల విడుదలైన 2024 – 25 పదవ తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అద్భుత ఫలితాలను సాధించగా, మండల కేంద్రంలోని స్థానిక బాయ్స్ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలలు మాత్రం తిరోగమన దిశలో ఫలితాల వద్ద చతికిలబడ్డారు. ఒకసారి ఫలితాలను నిశితంగా పరిశీలిస్తే బాయ్స్ హైస్కూల్‌లో 105 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. అందులో 34 మంది ఉత్తీర్ణత సాధించగా 71 మంది ఫెయిల్ అయ్యారు. కేవలం 32 శాతం ఉత్తీర్ణతతో మండలంలోనే వెనుకబడి వున్నారు. మరోవైపు కేజీబీవీ పాఠశాలలో 36 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవ్వగా, అందులో 21 మంది ఉత్తీర్ణత సాధిస్తే 15 మంది ఫెయిల్ అయ్యారు. వారిలో అత్యధిక మార్కులు 465 కాగా, కనీసం 500 మార్కులకు ఒకరు కూడా నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకపోతే స్థానిక బాలికోన్నత పాఠశాలలో 95 మంది పరీక్షలకు హాజరవ్వగా, అందులో 25 మంది ఫెయిల్ అయ్యారు. ఇలాంటి పరీక్షా ఫలితాలతో ప్రభుత్వ పాఠశాల స్థాయిని, ప్రవేశాలను ఎలా పెంచగలుగుతారో ఉన్నత విద్యాశాఖ అధికారులు సమాలోచనలు చెయ్యాలని తల్లిదండ్రులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. రాబోయే రోజుల్లోనైనా కనీసం మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.